గ్రూప్-3 సజావుగా జరిగేలా..

- నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు
- నగరంలో 102 పరీక్షా కేంద్రాలు
- పరీక్షకు 45,918 మంది అభ్యర్థులు
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): గ్రూప్-3 పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం సూచించారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేల అన్నీ ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. జిల్లాలో 102 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఆదివారం జరిగే పరీక్షలు ఉదయం 8:30 గంటలకు అభ్యర్థులు సెంటర్లకు చేరుకోవాలని, మధ్యాహ్నం నిర్వహించే పరీక్షకు 1:30 గంటలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. హాల్ టికెట్, ఒరిజినల్ ఐడీ గుర్తింపు కార్డులు తప్పకుండా తీసుకురావాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. 45,918 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు వివరించారు.

సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో 144 సెక్షన్

గ్రూప్-3 పరీక్షల నేపథ్యంలో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఈ నెల 16వ తేదీ నుంచి 17 వరకు రెండు రోజుల పాటు 144 సెక్షన్ విధిస్తూ కమిషనర్లు అవినాష్ మహంతి, సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆంక్షలు అమలులో ఉన్న ప్రాంతంలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టడం నిషేధమని, పరీక్షా కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, ఫొటో స్టూడియోలను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆంక్షలు నేటి ఉదయం 10 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు.

పరీక్షలకు ప్రత్యేక బస్సులు

గ్రూప్-3 పరీక్షల దృష్ట్యా అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా నగరంలో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచునున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా 102 పరీక్ష కేంద్రాలను దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. కోఠి, రెతిఫైల్‌లో కమ్యూనికేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లే బస్సుల సమాచారం కోసం ఫోన్ నం. 99592 26160, 99592 26154లలో సంప్రదించి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. నేడు, రేపు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును పాతబస్తీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పంకజ్ షిండే శనివారం కలిశారు. ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పంకజ్ షిండే శనివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. పాతబస్తీలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టత కోసం పాటు పడాలని తనను ఆదేశించినట్లు పంకజ్ షిండే తెలిపారు.

– అబిడ్స్, నవంబర్ 16;

సిల్ట్ ఛాంబర్ తప్పనిసరి

- అన్ని భవనాల్లో ఉండాలని జల మండలి ఆదేశం

సిటీబ్యూరో, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): అవుటర్ రింగు రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగరంలో సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకున్నది. మురుగునీటిలో కరగని వ్యర్థాలను కట్టడి చేసేందుకు ప్రతి భవనం పరిధిలో సిల్ట్ ఛాంబర్లను తప్పనిసరి చేసింది. రెసిడెన్షియల్, కమర్షియల్ బిల్డింగుల పరిధిలో వీటిని ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలుపెట్టి, సిల్ట్ ఛాంబర్లు లేని భవంతులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టనుంది. పైపు లైన్లలో కరగని వ్యర్థాలను వేరు చేసేందుకు ఈ సిల్ట్ ఛాంబర్లు ఎంతగానో సాయపడుతాయని వాటర్ బోర్డు భావిస్తోంది. ఈ క్రమంలో నగరంలోని అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య భవనాల సీవరేజీ కనెక్షన్లకు సిల్ట్ ఛాంబర్లు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. సీవరేజీ పైపు లైన్లలో ఘన వ్యర్థాల భారాన్ని తగ్గించడానికి సాయపడుతుందని, సీవరేజీ అవుట్ లెట్లలో సిల్ట్ ఛాంబర్లు డిసెంబర్ నెలాఖరులోపు ఏర్పాటు చేసుకునేలా జల మండలి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది.

21, 22వ తేదీలలో దివ్యాంగులకు క్రీడలు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 16: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సందర్భంగా ఈ నెల 21, 22వ తేదీలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. జిల్లాలోని నేరేడ్‌మెట్ చౌరస్తాలోని రామకృష్ణ పురం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చెస్, ట్రైసైకిల్, రన్నింగ్, షాట్ పుట్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులలో జూనియర్ విభాగం 10 ఏండ్ల నుంచి 17 ఏండ్లు, సీనియర్ విభాగం 18 ఏండ్ల నుంచి 54 వయసు గలవారు తమ పేర్లను నమోదు చేసుకొని పోటీలలో పాల్గొనాలని సూచించారు. క్రీడలలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విజేతలను ప్రకటించిన జోస్ అలుక్కాస్

JOS ALUKKAS

సిటీబ్యూరో, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రముఖ జువెల్లరీ రిటైల్ సంస్థ జోస్ అలుక్కాస్ 60వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా ప్రైజ్ కార్యక్రమంలో ఆరు ఎంజీ ఆస్టర్ కార్లు, గృహోపకరణాలు, బంగారు నాణేలతో పాటు, మెగా ప్రైజ్‌లను గెలుచుకున్న విజేతలను ప్రకటించింది. ఎంజీ ఆస్టర్ కార్లను గెలుచుకున్న లక్కీ విన్నర్లలో చెట్టికుళంకు చెందిన అబ్దుల్ అజీజ్, వైజాగ్‌కు చెందిన బేగం, హైదరాబాద్‌కు చెందిన కేఎస్ దుర్గా ప్రసాద్, మంజేశ్వరకు చెందిన ఎం.లోకేశ్ రాయ్, స్లోగన్ పోటీల్లో పుదుక్కోట్టికి చెందిన భారతీదాసన్, హోసూర్‌కు చెందిన బాల మురుగన్ ఎంఎస్ ఉన్నట్లుగా తెలిపారు. వినియోగదారుల విశ్వసనీయత, ప్రేమాభిమానాలను పొందేందుకు జోస్ అలుక్కాస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా చైర్మన్ జోస్ అలుక్కాస్ తెలిపారు.

మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు సరే.. తులం బంగారం ఏది?
- యూసుఫ్‌గూడలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మహిళా లబ్ధిదారులు

యూసుఫ్‌గూడలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, నవంబర్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. శ్రీకృష్ణానగర్ లేబర్ అడ్డా వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూసుఫ్‌గూడ, షేక్‌పేట్ డివిజన్లకు చెందిన 10 మంది సీఎంఆర్ఎఫ్, 19 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.19.02 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినప్పుడు తులం బంగారం ఇవ్వడం లేదా? అని మహిళలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం బాకీ ఉన్నారని, ఇంకా మహిళలకు రూ.2500 భృతి, రూ.500లకే వంట గ్యాస్, రూ.4 వేల పెన్షన్లు ఇవ్వాల్సిందేనని అన్నారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏడాది గడిచినా అమలుచేయకుండా చేతికి దొరికిన వాళ్ళను అక్రమ అరెస్ట్‌లు చేస్తూ ప్రజల దృష్టి మరలుస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల విషయమై ప్రభుత్వం తప్పించుకోవడానికి లేదు.. ఇచ్చిన మాట ప్రకారం కొత్త ఏడాది నుంచైనా ఆరు గ్యారెంటీలు అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, బీఆర్ఎస్ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, నాయకులు బస్వరాజు, శరత్, బాబి, అజర్, గణేష్, కైసర్ జహాన్, గీతా గౌడ్, అమ్మాజీ, ప్రవంతి, అరుణ, రమాదేవి, రేణుక, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓవర్సీస్ విద్యానిధి పథకానికి 27 మందే ఎంపిక

- అర్హత ఉన్న విద్యార్థులందరికి పథకం వర్తింపజేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

మేడ్చల్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): విదేశాలలో చదువుకునేందుకు అర్హత సాధించిన ఎస్సీ విద్యార్థులందరికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకాన్ని వర్తింపజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో విదేశాలలో చదివేందుకు ఓవర్సీస్ విద్యానిధి పథకానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 27 మందిని మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసింది. విదేశీ విద్యానిధి పథకానికి 60 మంది విద్యార్థులు అన్ని అర్హతలు సాధించి దరఖాస్తులు చేసుకుంటే, ఇందులో 27 మంది విద్యార్థులను మాత్రమే విద్యకు ఎంపిక చేయడం, విద్యార్థులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. విద్యా నిధి పథకానికి అర్హత సాధించాలంటే బీ టెక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు విదేశాలకు వెళ్లేందుకు టోఫెల్, ఏజీఆర్ఈ, జీఆర్ఈ, ఐఎల్‌టీఎస్‌లో అర్హత సాధించి వివిధ దేశాలలో వీసా పొందినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థలో దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల చొప్పున చెల్లిస్తూ విమాన చార్జిలు వీసా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి 141 మంది విద్యార్థులకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

టీజీ సెట్ ఫలితాల విడుదల

టీజీ సెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించిన టీజీ సెట్-2024 పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను సెట్ కార్యాలయంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో కలిసి సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి శనివారం విడుదల చేశారు. అనంతరం, ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి మాట్లాడుతూ, పరీక్షకు మొత్తం 33,494 మంది దరఖాస్తు చేసుకోగా, 26,294 మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. పరీక్షకు హాజరైన వారిలో 1,884 మంది అర్హత సాధించారని చెప్పారు. పరీక్షకు హాజరైన వారిలో 7.17 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించగా, వారిలో 49.79 శాతం మంది మహిళలేనని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత హాల్ టికెట్ నంబర్, పుట్టిన రోజు తేదీలను ఎంటర్ చేసి స్కోర్ కార్డులను పొందవచ్చన్నారు. అర్హత సాధించిన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించే తేదీలను త్వరలోనే తమ వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తామని వివరించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొ. కరుణసాగర్, ప్రొఫెసర్లు విజయ, రాజేందర్, నాగేంద్రబాబు, సునీత, ఓఎస్డీ జితేందర్ కుమార్ నాయక్, లావణ్య, మురళీకృష్ణ, శ్రీనగేశ్, డా. కొండా నాగేశ్వర్, డా. గంగాధర్ పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు రద్దుకు ప్రభుత్వంతో మాట్లాడండి

- ఇన్‌చార్జి వీసీ రిజ్వీని కోరిన అంబేద్కర్ వర్సిటీ జేఏసీ నేతలు

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 16: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంతో మాట్లాడాలని వర్సిటీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నేతలు ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఎస్ఎం రిజ్వీని డిమాండ్ చేశారు. సెక్రటేరియేట్‌లో జేఏసీ నేతలు ఇన్‌చార్జి వీసీనీ శనివారం కలిసి మాట్లాడారు. యూనివర్సిటీ మనుగడకే ప్రమాదకరంగా ఉన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని, 58 రోజులుగా యూనివర్సిటీకి చెందిన ఉద్యోగులు నిరసన చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం, యూనివర్సిటీలో జేఏసీ అధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ డా. వేణుగోపాల్ రెడ్డి, నేతలు డా.రజిని, డా. కె.కృష్ణారెడ్డి, డా. యాకేశ్ దైదా పాల్గొన్నారు.

వక్ఫ్ సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే కృషి అమోఘం

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, నవంబర్ 17: కుత్బుల్లాపూర్ డివిజన్‌లో పలు కాలనీలలో గత కొంతకాలంగా వక్ఫ్ బోర్డు సమస్యతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కుత్బుల్లాపూర్ 131 డివిజన్ 171 సర్వే నంబర్‌లో గత కొన్ని రోజుల నుంచి వక్ఫ్‌బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేశారు. ఈ కాలనీల్లో దాదాపు 90 శాతం మంది ప్రజలు అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీసుకొని తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం ప్లాట్లు కొని పెట్టుకున్నారు. వక్ఫ్ బోర్డు పేరుతో గత కొంతకాలంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడంతో దాదాపుగా 55 కాలనీవాసులు సమస్యను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంపై మేడ్చల్ కలెక్టర్, ఆర్డీఓ, డీఆర్, డీఐజీ, ఐజీ వంటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పునఃప్రారంభించడంతో సమస్య పరిష్కారానికి నాంది పలికింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, నిరంతరం ప్రజా సంక్షేమం కోసం, వారి అభ్యున్నతికి తాను ముందుండి పని చేస్తానని, ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని కాలనీల వాసులకు భరోసాను ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు దేవరకొండ శ్రీనివాస్, సత్తి రెడ్డి, పప్పి రెడ్డి, సురేందర్ రెడ్డి, సతీశ్ రెడ్డి, సత్తీశ్, అప్పా రావు, మురళీ, బ్రహ్మానందం, దేవేందర్ రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే.. సహించేది లేదు

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్
- రాజ బొల్లారం, పూడూర్ గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్

మేడ్చల్ రూరల్, నవంబర్ 16: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు పూరించిన ఫారాల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మేడ్చల్ మండలంలోని రాజ బొల్లారం, పూడూర్ గ్రామాల్లో కలెక్టర్ శనివారం పర్యటించి ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గ్రామాల్లో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో ఎన్యూమరేటర్లు పూరించిన ఫారాలను ఏ రోజుకారోజు ట్రంకు పెట్టెల్లో పెట్టి గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో భద్రపర్చాలని ఆదేశించారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం కాని, ఆలస్యం కాని చేయరాదని తెలిపారు. నమోదు ప్రక్రియ పూర్తైన వెంటనే ఆపరేటర్లతో వివరాలను కంప్యూటర్లలో అప్‌లోడ్ చేయించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు దగ్గరుండీ ఆపరేటర్ల ద్వారా తప్పులు జరుగకుండా జాగ్రత్తగా అప్‌లోడ్ చేయించాలని చెప్పారు. సర్వే నమోదులో ఎలాంటి తప్పుడు లేకుండా చూసుకోవాలని, ఎన్యూమరేటర్లు పూరించిన ఫారాలను సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు పరిశీలించాలని అదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్ తాసీల్దార్ శైలజ, ఎంపీడీవో వసంత లక్ష్మి, పర్వేసిబ్బంది పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

రాందేవ్ రావు వైద్యశాలలో వ్యాక్సినేషన్‌పై అవగాహనలో మాట్లాడుతున్న ఛాయాదేవి

- రాందేవ్ రావు వైద్యశాల గైనకాలజీ హెచ్‌వోడీ డా. ఛాయాదేవి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 16: మహిళలు సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని, వాక్సినేషన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌ను మహిళలు జీవితకాలం నివారించవచ్చని రాందేవ్ రావు వైద్యశాల గైనకాలజీ హెచ్‌వోడీ ఛాయాదేవి అన్నారు. కూకట్‌పల్లి రాందేవ్ రావు వైద్యశాలలో సర్వైకల్ క్యాన్సర్ ఎలిమినేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యశాల గైనకాలజీ హెచ్‌వోడీ ఛాయాదేవి, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ భవాని దివ్య, డాక్టర్లు మంజుల, అర్చనా మోరే, సీఈవో ఎన్.యోబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగానే ట్రీట్‌మెంట్ తీసుకోవడం మంచిదన్నారు. మహిళలకు గర్భాశయ ముఖ ద్వారానికి వచ్చే క్యాన్సర్‌ను సర్విక్స్ అంటారని, ఈ క్యాన్సర్ ప్రతి 50 మందిలో ఒకరికి వస్తుందని, ఈ కాన్సర్‌ను నివారించేందుకు వైద్యశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవలే వైద్యశాలలో 250 మంది చిన్నారులకు ఉచితంగా వ్యాక్సినేషన్ వేసినట్లు తెలిపారు. ఈ వ్యాక్సినేషన్‌పై ప్రజలకు అవగాహన పెంచుకోవాలని, తొమ్మిదేండ్ల నుంచి 14 ఏండ్ల ఆడ బిడ్డలతో పాటు మహిళలంతా తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

అట్టడుగు వర్గాలకు నల్సార్ విద్య.. అభినందనీయం

- నల్సార్‌లో స్నాతకోత్సవంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే
- ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్-2024 బ్యాచ్ అభ్యర్థులకు డిగ్రీ పట్టాలు

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, వీసీ కృష్ణదేవరావు

శామీర్‌పేట, నవంబర్ 16: అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయంపై ప్రత్యేక దృష్టి సారించి రాజ్యాంగవాదం, చట్ట భద్రత, న్యాయాన్ని నొక్కి చెప్పే నాణ్యమైన న్యాయ విద్యను అందించడానికి నల్సార్ చేసిన కృషి అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే అన్నారు. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా నల్సార్ అందించే ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్-2024 బ్యాచ్‌కు అర్హత పొందిన అభ్యర్థులకు డిగ్రీలను, అడ్వాన్స్‌డ్ డిప్లమాల ప్రదానం కోసం ప్రత్యేక స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఆరాధే మాట్లాడుతూ, 1989 నూతన విద్యా విధానం కాలం నుంచి దూర విద్య క్రమంగా పెరుగుతుందన్నారు. నల్సార్ ఈ రంగంలో తనదైన పాత్రను పోషిస్తుందని చెప్పారు. త్రూత్ ల్యాబ్, టెక్స్‌మెన్, ఈబీసీ లెర్నింగ్ వంటి నాలెడ్జ్ హబ్‌లతో నల్సార్ యొక్క సహకారాన్ని అందిస్తుందన్నారు. నల్సార్ ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో విద్యార్థుల నమోదులో దాదాపు 50శాతం మంది మహిళలు ఉన్నారని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా తెలుగులో భారత రాజ్యాంగంపై ప్రాథమిక కోర్సును ప్రారంభించడంలో నల్సార్ ప్రయత్నాలను ఇటీవల అభినందించారు. ఈ కోర్సులో ప్యానెల్ చర్చలు, ఇంటర్వ్యూలు, కేస్ స్టడీస్, వాక్-ది-టాక్ సెషన్స్ వంటి విభిన్న పద్ధతులను కవర్ చేసే 32 వీడియోలు ఉన్నాయన్నారు. స్నాతకోత్సవానికి 287 మంది గ్రాడ్యుయేట్లు హాజరు కాగా, ఏవియేషన్ లా అండ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో విక్రమ్‌సింగ్, ఎంఏ క్రిమినల్ లా అండ్ ఫోరెన్సిక్ సైన్స్‌లో అక్షర, అడ్వాన్స్‌డ్ డిప్లమా ఇన్ క్రిమినల్ లా తరుణ్ జోషి బంగారు పథకాలు సాధించారు. మొత్తం 1255 డిగ్రీలు, డిప్లమాలు అందజేశారు. కార్యక్రమంలో నల్సార్ వీసీ ప్రొఫెసర్ కృష్ణదేవరావు, రిజిస్ట్రార్ వాసంతి, అధ్యాపకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి

- రేవంత్ రెడ్డి మాటలకు పొంతన లేదు: ఎంపీ ఈటల

చిక్కడపల్లి, నవంబర్ 16: విద్యా ప్రమాణాలు పెంచాలంటే నిబంధనలకు అనుగుణంగా ఎంపికైన సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని, జీత భత్యాలు పెంచి, ప్రమాద బీమా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుండిగల్ యాదగిరి, ఝాన్సీ సోజన్యల ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల హాజరై మాట్లాడారు. రేవంత్ రెడ్డికి ఎన్నికల ముందు, తర్వాత మాట్లాడే మాటలకు పొంతన లేదని విమర్శించారు. అధృష్టం కొద్దీ సీఎం అయ్యాడని ఎద్దేవా చేశారు. మళ్లీ ఐదేండ్లకు ఓట్ల కోసం రావాల్సిన విషయాన్ని మర్చిపోవద్దని, పదవులు శాశ్వతం కాదన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఆగమాగమై తే, ప్రజలు మిమ్మల్ని ఆగం చేయడం ఖాయమన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీపాద రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సు